# పెన్నేటి కతలు

-రామకృష్ణారెడ్డి

## నంగులమ్మ దున్నపోతు

ఏటవుతలి ఊళ్ళల్లో యెవురో దాన్ని సిన్నప్పుడు నంగులమ్మకని[1] యిడ్చినారంట. ఇంగ అప్పట్నించీ అది అడ్డం ల్యాకుండా యే సేలల్లో వడ్తే ఆ సేలల్లో వడి మేసి యిరగబల్సి ఏనిగాలయి, మకురెక్కి పోయింది. ఏనిగ కన్నా ఎప్పుడో ఒకసారి మదమెక్కు తాదంటగానీ, యీ నంగులమ్మ దున్నపోతుకు యెక్కిన మదం యెప్పుడూ దిగిందేలేదు. అదో... ఆ జెనుమగడ్డలాయన అట్ల దాని మదం దించినాడు గానీ, దానికై అద్దిగలేదు. ఆ దున్నపోతెట్టుండె, ఆ జెనుమగడ్డలాయప్ప యెట్టుండె? అజ్జెప్తేగినా... ఆచ్చెరమయిపోతాది మల్లి.

నంగులమ్మ దున్నపోతు అంత దూరాన్నించీ బుస పెడ్తా వస్తాంటే, నల్లని మోడం గదా వురుముతా పెరుగుతా వస్తాన్నెట్టుండేది. అయితే, మోడం వచ్చేది జూస్తే సంబరమైతే, యిదొచ్చేది కనపడ్తే బెదురుపుట్టేది. ఏట్లో ఆవల్ల అది దిగిందంటే యీ వల్ల నీళ్ళు తెచ్చుకునే ఆడోళ్ళూ మొగోళ్ళూ ఆదలా బాదలా పరిగెత్తా యిండ్లల్లో వడేవాళ్ళు. అది ఏటి మీద వచ్చేతప్పుడు ఆంత దూరాన మనిసి కనపన్నా, గొడ్డు కనపన్నా ఇసికలో మోకాళ్లోతున గుంత వడేట్టుగా కాల్దువ్వుతాది. ఆకాసెంలో బోయే పచ్చి గూడా ఆ దున్నపోతు మీన బోయేప్పుడు అర్సకుండా బోతాది! సుట్టుపట్ల వదూళ్ళల్లో పిల్లోళ్ళుగినా యేడ్చుతే, వాళ్ళమ్మగార్లు 'నంగులమ్మ దున్నపోతొస్తాందాది' అని బెదిరిచ్చి ఏడుపు మానిపిచ్చేవాళ్ళు.

ఏట్లో అయ్యాలప్పుడూ యియ్యాలప్పుడూ బండి పోవాల్నంటే యెక్కన్నుంచీ అదొస్తాదో అనిగుండెలు లొటలొటలాడేటెయి. శానామాట్లు అది ఎద్దల మీద బడి,సెలిగిపారేసింది. ఏట్లో వగులు ఎనములు మేసేతప్పుడు అదొచ్చిందంటే పసుల పిల్లోళ్ళు వురికిపోతారు. అదిగానీ ఎక్కిందంటే అల్లాటప్పా ఎనుమయితే నడుములిరిగి ఆన్నే వడిపోవాల్సిందే. ఎనముల్తోపాటు యాన్నన్నా దున్నపోతుగానీ దాని కంటెక్కనిపడిందంటే, యింగ దానికి తీర్నట్టే! ఎద్దల మీద కంటే దానికి దాన్జాతయిన దున్నపోతు మీద యింగామాంతమైన కోపం. ఏట్లో గడ్డి వరకలు మేసేదానికీ, యాసేలోనైనావడి మెత్తని పైరు మేసే తనకూ యానమందం లేదని సెప్ప డానికదట్ల జేసేదేమో... తెల్దు. దున్నపోతు దాని కంట బడ్తే మల్లబతకనీదని మా(త్రం అందరికీ తెల్సిందే.

'నంగులమ్మ దున్నపోతు' అని అంటా వుండడమేగానీ దానికీ, ఏట్లో గడ్డి మేస్తా వుండే బక్క దున్నపోతుకూ సమందమున్నెట్టు యెవురికీ గ్యాపక మొచ్చేదీగాదు లే. దాన్జూస్తానే బెదిరిపోతా, "దీనికి వరకతగలా, దీన్ని నంగులమ్మకాడ యెప్పుడు వరుకుతారో" అని తిట్టుకుంటానే, మల్లాతిట్నిం దుకు సెంపలేసుకునేవాళ్ళు. "దేవత కిడ్సిన దున్న పోతును తిడ్తే పాపం" అనుకునేవాళ్ళు. దేవతా దున్నపోతు సేలల్లో వడి తింటేతిన్నీలే... అద్దింటే మన కెంత నట్టమయితాది, అనుకునేవాళ్ళు. అదేమన్నా పొద్దాకులూ ఒక్కని సేలోనే వడి తింటా వుందా, అందరి సేలల్లోనూ వడి తింటా వుంది గదా, అనుకునేవాళ్ళు.



అది కదుపు నిండా మేసొచ్చి, ఏ ఊరి ముందరన్నా పండుకోని నెమరేస్తావుంటే, దూర దూరాన్నుంచీ సి(త్రంగా సూసేవాళ్ళు జనం. అది పండుకోనుంటే యెంత దర్జాగా వుండాదో, దాని యీరు యెంత ఎడల్పున వుందో, పెయి యెంత నున్నంగా యీగవాల్తే జారిపోయేట్టుండాదో, మెడ యెంత లావుగా రొండు సేతుల్తో కర్సుకొన్నా అందకుండా వుండాదో... మాట్లాడుకుంటారు. వలానా ఊళ్ళో యెవురో తన సేలో మేసిందని, ములు గట్టెతో నంగులమ్మ దున్నపోతు యీరున యెప్పుడో కొట్నా డంట. ఆ రా(త్రికే ఆయప్ప యీరున మంటలు పుట్టి అల్లాడిపోయినాడు! యింగెవరో దాన్ని 'వరక తగలా' అని తిట్నారంట. మర్సటి రోజు పాలిచ్చే ఎనుము గాటికాన్నే వడి సచ్చిపోయిందంట! యిట్ల మాట్లాడుకుంటారు. దేవతా దున్నపోతును కొట్నా, తిట్నా యేమయిందో సెప్పుకుంటా వుండేటెయి యెక్కడ జరిగినాయో యెవురికీ తెల్దు. ఆ దేవతా దున్నపోతు సేలను పాడుజేసేదీ, అందర్నీ బయపడిస్తావుండేదీ కండ్లకు కనపడ్తానే వుండాది. అయినా కనపడ్తావుండేవాటికన్నా, కనపడకుండా వుండేటెయే వాళ్ళ మీంద బలంగా పన్జేస్తాండాయి!

యిట్టాటప్పుడు అజ్జరిగింది. ఆ రోజు తెల్ల వార్నాల నుంచీ ఊళ్ళో అందర్లూ జెనుసుగడ్డలు కొనక్కపోతావుండారు శాల్లల్లో పోసుకోని. గడ్డలు బలేతియ్యంగా వుండాయని అనుకుంటా వుండారు. ఒకర్ని జూసి ఒకరు శాల్లల్లో గింజలు పోసుకోని పోయి ఆ గడ్డలు తెచ్చుకున్రి.దాంతో ఏ పయిటాలకో గానీ గడ్డలు అయిపోవనుకొన్న జెనుసుగడ్డ లాయప్పకు సినంబళ్ళ పొద్దుకే పనయిపాయె. ఎండ బడకుండా మల్లా ఊరు జేరుకొందామని, ఆ జెనుసుగడ్డ లాయప్పా, ఆయప్ప కొడుకు గింజల మూటెను బండ్లో యేసుకోని దున్నపోతుల్ను బండికి గట్టి, ఏట్లో దిగిరి. తెచ్చుకున్న సద్దికూడు తీసకపోకుండా తినిపోతే బాగుంటాది గదాని, ఏట్లో సెలిమెకాడ కూచ్చోని సద్ది మూట యిప్పినారు.

పక్కన్నే బండిక్కట్న దున్నపోతులు నెమరేస్తా నిల బడుకోనుండాయి. యాన్నుంచీ వొచ్చిందో నంగులమ్మ దున్నపోతు వొచ్చీ రావడంతోనే యీ దున్న పోతుల మీద వడిపోయింది. సద్ది దినేవాళ్ళొచ్చి సిన్న సిన్న రాళ్ళేస్తా అదిలిస్తే అది లెక్కే జేయలా. కాళ్ళూ సేతులూ ఆడని వాళ్ళు సూస్తా వుండగానే ఒక దున్నపోతును నిలువునా సంపేసింది! యింగోటి పట్టెడ తెంపుకోని తప్పిచ్చుకోని పారిపోయింది. నడేట్లో తనకైన గతి జూసే సరికి యేమనిపిచ్చిందో ... జెనుమగడ్డ లాయప్ప బండెక్కి జోల్లకావుగా కట్న మాంచి శావ నాటు సేతికి తీసుకొన్నాడు. నంగులమ్మ దున్నపోతు రొండు కొమ్ముల నందున తలకాయలోంచీ మెదుదు బయటపడేతట్లు... ఒక్కేటు యేసినాడు! ఎట్టేసినాడో తెల్దు. నంగులమ్మ దున్నపోతు బయం మా(త్రం మల్లల్యాకుండా పోయింది.

దేవతా దున్నపోతును సంపినందుకు ఆయప్ప కేదో అయితాదని అందరూ అనుకొన్నారు. ఏం గాలేదు. ఆయప్ప ఎన్నో మాట్లు జెనుమ గడ్డలు అమ్ముకోను వస్తానే వుండె. "అంత పెద్ద దున్న పోతును యింత సిన్న మనిసివి యెట్ల సంపితివి?" అనడిగితే, "ఎట్ల సంపినానో నాకే తెల్దు" అని నగేవాడు.

1. నంగులమ్మ అనే (గ్రామ దేవత. 2. గెనుసుగడ్డలు లేక చిలగడదుంపలు 3. తీ(వ్రమైన 4. దూము, కలరా 5. చేటల్లో 6. ఏ అపరాహ్ణానికో 7. చేవగలిగిన నాటు (క(ర.)